ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 87 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-    బుధవారం 30 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888    Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## ఏపీలో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయండి : ఐటీ సర్వ్ సినర్జి సమ్మిట్లో లోకేశ్

ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయన లాస్వెగాస్ నగరంలో నిర్వహించిన ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్లో పాల్గొన్నారు.



**లాస్వెగాస్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. ఇందులోభాగంగా ఆయన లాస్వెగాస్ నగరంలో నిర్వహించిన ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్లో పాల్గొన్నారు. సమ్మిట్ ప్రాంగణంలో పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్, పెప్సికో మాజీ సీఈవో ఇంద్రానూయి, రెవేచర్ సీఈవో అశ్విన్భరత్, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాతో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలతలను వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్లో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్ను లోకేశ్ కోరారు. సులభతరమైన పౌరసేవలకు సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎంటర్ప్రైజ్ సొల్యూషన్పై దృష్టి పెట్టామని రేచల్ స్కాఫ్ చెప్పారు. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్పై అమెజాన్ దృష్టి సారించిందన్నారు. ఏఐ, ఎంఎల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. రెవేచర్ సీఈవో అశ్విన్ భరత్ మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్లో టెక్ టాలెంట్ డెవలప్మెంట్ సెంటర్ను నెలకొల్పడానికి భాగస్వామ్యం వహించాలని కోరారు. సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, ఇతర డిమాండ్ ఉన్న ఐటీ నైపుణ్యాల్లో రాష్ట్రంలోని యువతకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కోడింగ్ బూట్ క్యాంప్లను అందించడానికి ఆంధ్రప్రదేశ్లోని విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలతో కలసి పనిచేయాలని చెప్పారు. క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్లో ఏపీటీడీ లక్ష్యాల సాధనకు ఏడబ్ల్యూఎస్ ఉపకరిస్తుందని లోకేశ్ తెలిపారు. స్మార్ట్ గవర్నెన్స్లో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ సేవలు రాష్ట్రంలో కీలకమన్నారు. ఏఐ, ఎంఎల్లో ఏడబ్ల్యూఎస్ శ్రద్ధ, నిబద్ధత తమ ఆశయాలకు ఊతమిస్తాయని లోకేశ్ చెప్పారు. ఏపీలో క్లౌడ్ సేవలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని ఏడబ్ల్యూఎస్ ఎండీ తెలిపారు.

## ఉచిత గ్యాస్ సబ్సిడీ.. పెట్రోలియం సంస్థలకు చెక్కు అందజేసిన సీఎం చంద్రబాబు



సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

**అమరావతి, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు పెట్రోలియం సంస్థలకు అందజేశారు. అమరావతిలోని సచివాలయంలో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు అయ్యే రూ.2,684 కోట్ల ఖర్చుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మొదటి ఉచిత సిలిండర్కు ఖర్చు అయ్యే రూ.894 కోట్లను పెట్రోలియం సంస్థలకు ప్రభుత్వం అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించనుంది. మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును విడుదల చేయనుంది. 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది.

## ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు

దిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టింది.




**అమరావతి, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టింది. 'రీ డెవలప్మెంట్ ఆఫ్ ఏపీ భవన్' పేరుతో 11.53 ఎకరాల్లో నిర్మాణం కోసం డిజైన్లకు టెండర్లను ఆహ్వానించింది. 'ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్'ను వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. సాయంత్రంలోపు గుత్తేదారులు వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలని అందులో పేర్కొంది. నవంబర్ 28 లోపు ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన న్ను విభజించారు. ఎన్నికలకు ముందు 2 తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజనను ఖరారు చేశారు. 2 రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను తెలుగు రాష్ట్రాలు కలిసి వినియోగించుకుంటున్నాయి.

## పత్తి రైతుకు దక్కని మద్దతు ధర

పత్తి రైతు కుదేలవుతున్నాడు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తెల్ల బంగారానికి మద్దతు ధర దక్కడం లేదు.



**ఆదిలాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** పత్తి రైతు కుదేలవుతున్నాడు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తెల్ల బంగారానికి మద్దతు ధర దక్కడంలేదు. తేమ పేరుతో సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు మెలిక పెడుతున్నారు. నేటి వరకు సీసీఐ 4,235 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. ప్రైవేటు వ్యాపారులు మాత్రం 26,484 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పత్తి మద్దతు ధరను 7,521గా ప్రకటించింది. ఒక్క రైతుకు కూడా ఇప్పటివరకు ఆదిలాబాద్ లో ఇది దక్కలేదు. తమను ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

## జన్వాడ ఫామ్ హౌస్ కేసు.. విచారణకు హాజరైన రాజ్ పాకాల

జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.



**హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** జన్వాడ ఫామ్స్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో పాటు ఆయన విచారణకు వచ్చారు. ఇటీవల రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు.జన్వాడలో ఫామ్ హౌస్పై ఇటీవల సైబరాబాద్ ఎస్ వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫామ్ హౌస్లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 35 మందితో నిర్వాహకులు మద్యం పార్టీ నిర్వహించారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధరించారు. ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగానే రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు.

## కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర.. మీరా ఆయన పేరును తుడిచేది?: కేటీఆర్

పదవుల కోసం రేవంత్రెడ్డి పరితపిస్తున్నప్పుడు కేసీఆర్ ఉన్న పదవే వదిలేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



**హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** పదవుల కోసం రేవంత్రెడ్డి పరితపిస్తున్నప్పుడు కేసీఆర్ ఉన్న పదవే వదిలేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "ఉద్యమకారులపై గన్ను ఎక్కు పెట్టినప్పుడు కేసీఆర్ ప్రాణాన్నే ఫణంగా పెట్టారు. తెలంగాణను చంపేందుకు రేవంత్ బ్యాగులు మోసిన సమయంలో.. ఆయన రాష్ట్ర భవిష్యత్తుకు ఊపిరి పోశారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర.. మీరా ఆయన పేరును తుడిచేది? " అని కేటీఆర్ పేర్కొన్నారు. మూసీపై ముందుకు.. కొనుగోళ్లపై వెనక్కు అని కేటీఆర్ విమర్శించారు. "రామన్నపేటకు రైరై.. కొనుగోలు సెంటర్లకు నైనై. దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు డాండాం. కొనుగోళ్లకు దిక్కులేదు.. కాంగ్రెస్ కోతలకు లెక్కలేదు. దళారులకు దండిగా.. రైతన్నలకు దండగా. ఎద్దేడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పుడూ బాగుపడదు" అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణ వాయిదా

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది.



**హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. కొండా సురేఖ తరఫున న్యాయవాది గురుమిత్సింగ్ హాజరయ్యారు. రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం నవంబర్ 13కు వాయిదా వేసింది.

## బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా?: షర్మిల

వైకాపా అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దుకు కుట్రగా ఆ పార్టీ నేతలు పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.



**అమరావతి, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా అధ్యక్షుడు జగన్ బెయిల్ రద్దుకు కుట్రగా ఆ పార్టీ నేతలు పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ ఆస్తుల వివాదం నేపథ్యంలో ఆమె మరోసారి స్పందించారు. "ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదు.. రూ.32కోట్ల విలువైన కంపెనీ స్థిరాస్తి. షేర్ల బదలాయింపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు లేవు. స్టేటస్ కో ఉన్నది షేర్లపై కాదు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటికి స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదం. నాకు 100 శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? 2021లో రూ.42 కోట్లకు క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను విజయమ్మకు ఎలా అమ్మారు? బెయిల్ రద్దవుతుందని షేర్లు విక్రయించినప్పుడు తెలియదా? అలా అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు. షేర్లు విక్రయించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. జగన్ బెయిల్కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసు." అని షర్మిల పేర్కొన్నారు.

## ఏపీలో పలుచోట్ల మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు

ఏపీలో పలుచోట్ల మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8 మంది సిబ్బంది. ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

**కాకినాడ, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో పలుచోట్ల మద్యం డిస్టిలరీల్లో సీఐడీ సోదాలు చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8 మంది సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పెద్దాపురం మండలం చిన బ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ పరిశ్రమలో అధికారులు సోదాలు చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. నల్లజర్ల మండలం ఆవపాడు, రాయవరం మండలం చెల్లూరు, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలోని డిస్టిలరీల్లో తనిఖీలు కొనసాగిస్తున్నారు. వైకాపా హయాంలో జరిగిన అక్రమాలపై వివరాలు సేకరిస్తున్నారు. డిస్టలరీలకు ఎంతమేర మద్యం సరఫరా చేశారనే విషయంపై ఆరా తీస్తున్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# పోలీసుల పేరుతో కిడ్నాప్.. రూ.4లక్షలుఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు

## విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది.



ఎస్.కోట, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. "ఈ నెల 28న ఉదయం 5.30 గంటలకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందినదంతులూరి వెంకటసూర్యనారాయణరాజు ఇంటికి ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు. తాము పోలీసులమని, విచారణ నిమిత్తం తీసుకెళ్తున్నట్టు చెప్పారు. ఆ తర్వాత సూర్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్ ఘటనపై 29న ఉదయం సూర్యనారాయణరాజు అల్లుడు కాకార్లపూడి శివప్రసాద్.. ఎస్.కోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ భాస్కరరావు బుధవారం ఉదయం 5గంటలకు ఉసిరి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు కార్లలో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. కిడ్నాప్ వ్యవహారం బట్టబయలైంది. ఏడుగురు కిడ్నాపర్ల నుంచి సూర్యనారాయణరాజును పోలీసులు రక్షించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విశాఖపట్నం మధురవాడ కొమ్మాది ప్రాంతానికి చెందిన కసిరెడ్డి రాజుకు, బాధితుడు సూర్యనారాయణరాజుకు దాదాపు 20 ఏళ్లుగా పరిచయం ఉంది. కొంతకాలంగా కసిరెడ్డి రాజు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. సూర్యనారాయణరాజు ఆస్తిపరుడని తెలిసి.. తన ఇద్దరు కుమారులు ప్రవీణ్, సాయి వారి స్నేహితులు మరో నలుగురితో కలిసి కసిరెడ్డి రాజు కిడ్నాప్నకు ప్రణాళిక వేశాడు. ఇందులో భాగంగా ఈనెల 28న అతని ఇంటికి వెళ్లి పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నాం" అని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు

**తెలుగు ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.**



అమరావతి, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): తెలుగు ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. "నరకాసుర వధ తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకొని సంతోషంగా నిర్వహించుకొనే వెలుగుల పండుగ దీపావళి. ఒక దీపాన్ని వెలిగించడం ద్వారా మన చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలినట్లుగా.. సూపర్-6 హామీల్లో భాగంగా 'దీపం 2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నాం. తెలుగింటి ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూసేందుకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అర్హులైన మహిళలు ఇప్పటికే ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇది ఎంతో సంతోషించదగిన విషయం. వారి నుంచి వస్తున్న స్పందనతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేలా స్ఫూర్తిని పొందుతున్నాం. ఈ ఆనంద దీపావళి.. రాష్ట్ర ప్రజల జీవితంలో కొత్త వెలుగు నింపాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

# భారాస నేతలు విమర్శించడమే పనిగాపెట్టుకున్నారు: మంత్రి కోమటిరెడ్డి

## తెలంగాణలో కులగణన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు.



హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో కులగణన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయంతీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్ గా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ నియమించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని కార్యక్రమాలనూ చేపడుతున్నామన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గుర్తించాలని హితవు పలికారు.

# పోలవరం బాధితులకు న్యాయం చేయాలి: సీపీఐ నేత రామకృష్ణ

## కరవు జిల్లాకు నీరు అందించే హంద్రీనీవాపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు.



అనంతపురం, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): కరవు జిల్లాకు నీరు అందించే హంద్రీనీవాపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో ప్రాజెక్టుల అంశంపై ఆయన మాట్లాడారు. నవంబర్లో ప్రవేశపెట్టే బడ్జెట్లో హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు ఒక్కొక్కదానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్రానికి ప్రయోజనాలు చేకూర్చే పోలవరం ఎత్తు కుదించడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్యాకేజీ డబ్బులు ఎగ్గొట్టడానికి కేంద్రం ఈ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. అలాగే పోలవరం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో పోలవరం ప్రాజెక్టు అంశంపై విజయవాడలో సమావేశం కానున్నట్లు చెప్పారు.

# ఐఏఎస్లు అమోయ్ కుమార్, నవీన్ మిత్తల్పై ఈడీకి ఫిర్యాదు



ఐఏఎస్ లు అమోయ్ కుమార్, నవీన్ మిత్తల్పై ఈడీకి ఫిర్యాదు అందింది.

హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): ఐఏఎస్ లు అమోయ్ కుమార్, నవీన్ మిత్తల్పై ఈడీకి ఫిర్యాదు అందింది. వీరితో పాటు విశ్రాంత ఐఏఎస్ సోమేశ్ కుమార్పై సురేష్, వేదే రాఘవయ్య ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలతో తమ భూమిని బదిలీ చేశారని అందులో పేర్కొన్నారు. 42 ఎకరాలకు నకిలీ పత్రాలు సృష్టించి మోసం చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఈడీ అధికారులు అమోయ్ కుమార్ను విచారిస్తున్నారు.

# కేంద్ర ప్రభుత్వం నిధులు ఎక్కడికి పోతున్నాయి?: ఎంపీ రఘునందన్ రావు

## గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్రావు విమర్శించారు.



హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్రావు విమర్శించారు. హైదరాబాద్లోని భాజపా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు.

# నా పంచాయితీ అనిల్ కుమార్ తో కాదు.. రేవంత్ రెడ్డితోనే: కౌశిక్ రెడ్డి




## తన పంచాయితీ అనిల్ కుమార్ యాదవ్ కాదు.. సీఎం రేవంత్ రెడ్డితోనే అని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): తన పంచాయితీ అనిల్ కుమార్తో కాదు.. సీఎం రేవంత్ రెడ్డితోనే అని భారాస ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు టెస్టుకు రావాలని నేను సవాల్ చేశా. కాంగ్రెస్ నేతలు మాకు చెప్పకుండా ఆసుపత్రికి వెళ్లి.. మమ్మల్ని రమ్మంటే ఎలా? డ్రగ్స్ కేసులో నన్ను ఇరికించాలని రేవంత్రెడ్డి ప్రయత్నం చేశారు. కేటీఆర్పై కూడా ఇలాగే ప్రయత్నించి విఫలమయ్యారు. రేవంత్రెడ్డి తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో డ్రగ్స్ టెస్టుకు రావాలి. కాంగ్రెస్ పాలనలో ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు" అని కౌశిక్ రెడ్డి విమర్శించారు. జన్వాడ ఫాంహౌస్ ఘటనపై కాంగ్రెస్, భారాస మధ్య ఆరోపణలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో భారాస సవాల్ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. బుధవారం ఉదయం హైదర్గూడలోని అపోలో ఆస్పత్రికి ఆ పార్టీ ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్తో పాటు పలువురు నేతలు వెళ్లారు. అక్కడ రక్తనమూనాలు ఇచ్చారు. సవాల్ చేసిన భారాస నేతలు కూడా వచ్చి శాంపిల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయండి.. బీసీ రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు ఆదేశం

## బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.



హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్. కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. "ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలి" అని పిటిషనర్ తరపున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

# జెత్వానీ కేసు.. విచారణ ప్రారంభించిన సీఐడీ

## ముంబయి నటి జెత్వానీ కేసులో సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. కేసుకు సంబంధించిన దస్త్రాలను ఇబ్రహీంపట్నం పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

అమరావతి, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): ముంబయి నటి జెత్వానీ కేసులో సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. కేసుకు సంబంధించిన దస్త్రాలను ఇబ్రహీంపట్నం పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. జెత్వానీ, ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ కేసులో ఇప్పటికే వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు వైకాపాతో అంటకాగి అక్రమ కేసులు బనాయించారనే ఆరోపణలపై ఇప్పటికే ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పీఎస్ఆర్ ఆంజనేయులతో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. వారిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.




# పాదయాత్రకు సిద్ధం.. రేవంత్రెడ్డి సెక్యూరిటీ లేకుండా రావాలి : హరీశ్ రావు

## మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు.

హైదరాబాద్, అక్టోబర్,30 (రిపబ్లిక్ న్యూస్): మూసీ సుందరీకరణకు తాము అనుకూలమేనని.. అయితే సుందరీకరణ పేరిట స్థిరాస్తి వ్యాపారానికి వ్యతిరేకమని భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. మూసీ పేరిట కమీషన్లు, పేదల ఇళ్లను కూల్చడం వంటి వాటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత కాలనీ రాజమౌళి సినిమాను తలపిస్తోందంటూ ఎద్దేవా చేశారు. మూసీ బాధితులకు మల్లన్న సాగర్ను మించిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "మూసీ బాధితులకు గచ్చిబౌలి భూముల్లో ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం. సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా పాదయాత్రకు రావాలి. మమ్మల్ని డీల్ చేయడం కాదు.. రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవాలి. పక్కనున్న వాళ్లే ఆయన్ను దించేయకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. 6 మంత్రి పదవులు నింపుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 100 సీట్లు రావడం ఖాయం" అని హరీశ్రావు ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1883:** ఆర్య సమాజం స్థాపకుడైన స్వామి దయానంద సరస్వతి మరణం (జ. 1824).
- **1909:** ప్రముఖ అణుశాస్త్రవేత్త హోమీ జహంగీర్ భాభా జననం (మ.1966). (చిత్రంలో)
- **1910:** రెడ్ క్రాస్ సంస్థ స్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ మరణం (జ.1828).
- **1931:** భగత్ ఉద్యమాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన గోవిందగిరి మరణం (జ.1858).
- **1938:** ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఎక్కిరాల భరద్వాజ జననం (మ.1989).
- **1945:** ఐక్యరాజ్యసమితిలో భారత్ సభ్యత్వం పొందింది.
- **1976:** భారత అత్యవసర స్థితి సమయంలో కేంద్ర ప్రభుత్వం, లోక్‌సభ ఎన్నికలను మరోమారు 1978కి వాయిదా వేసింది.
- **1990:** భారతీయ సినిమా పరిశ్రమలో నిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారాం మరణం (జ.1901).


దయానంద సరస్వతి


హోమీ జహంగీర్ భాభా


హెన్రీ డ్యూనాంట్


గోవిందగిరి


భరద్వాజ


ఐక్యరాజ్యసమితి


ఇందిరా గాంధీ


వి. శాంతారాం

## నందమూరి రామ్ కు ఎన్టీఆర్ ఆల్ ది బెస్ట్..

హరికృష్ణ మనవడు తారక రామారావును దర్శకుడు వైవిఎస్ చౌదరి పరిచయం చేశారు. ఈ అప్ కమింగ్ హీరోకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు..



నందమూరి కుటుంబం నుంచి కొత్త హీరో ఇండస్ట్రీకి పరిచయం కానున్నారు. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావు హీరోగా వై. వి.ఎస్.చౌదరి కొత్త సినిమాను తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. 'న్యూ టాలెంట్ రోర్స్' పతాకంపై ఆయన సతీమణి గీత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా వైవిఎస్ చౌదరి ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఎన్టీఆర్ను పరిచయం చేశారు. దీంతో ఈ అప్కమింగ్ హీరోకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ ఆల్ ది బెస్ట్ చెబుతూ పోస్ట్ చేశారు. 'రామ్ సినీ ప్రపంచంలోకి నీ మొదటి అడుగుకు అభినందనలు. సినిమా ప్రపంచం నిన్ను ఆదరించడానికి ఎదురుచూస్తోంది. నువ్వు చేసే ప్రతి ప్రాజెక్ట్ విజయం సాధించాలని కోరుకుంటున్నా. ముత్తాత ఎన్టీఆర్, తాత హరికృష్ణ, నాన్న జానకిరామ్ల ప్రేమ, ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి. నువ్వు ఉన్నత శిఖరాలకు చేరుకుంటావనే నమ్మకం ఉంది. నీ భవిష్యత్తు దేదీప్యమానంగా ఉండాలి మై బాయ్' - ఎన్టీఆర్న్ 'డియర్ రామ్.. నీకు శుభాకాంక్షలు. నువ్వు నీ తొలి సినిమాతోనే అందరూ గర్వపడేలా చేస్తావనే నమ్మకం ఉంది' - కల్యాణ్ రామ్న్ 'ఇక వాగ్దానం, ప్రతిజ్ఞ, ప్యాషన్.. సీనియర్ ఎన్టీఆర్ ఆశీస్సులతో నందమూరి తారక రామారావు ఇండియన్ సినిమాలోకి పవర్ఫుల్ ఎంట్రీ ఇస్తున్నారు' - వైవీఎస్ చౌదరి

రిపబ్లిక్ సినిమా CINEMA

## నయనతార డాక్యుమెంటరీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..!

అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ సిద్ధమైన విషయం తెలిసిందే. తాజాగా దీని స్ట్రీమింగ్ డేట్ను నెట్ఫ్లిక్స్ ప్రకటించింది.



అగ్ర కథానాయిక నయనతార జీవితం పై డాక్యుమెంటరీ ఫిల్మ్ సిద్ధమైన విషయం తెలిసిందే. ఆమె వృత్తి, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెటిక్స్ దీనిని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ప్రోమో సినీప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పలు విశేషాలను ఓటీటీ సంస్థ ప్రకటించింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్ అనే టైటిల్ ఫిక్స్ చేశారు. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు నయనతార. కాలేజీ రోజుల్లో ఆమె పార్ట్ టైమ్ మోడల్ గా వర్క్ చేశారు. ఓ సందర్భంలో ఆమెను చూసిన దర్శకుడు సత్యన్ అంతికాడ్.. 'మనస్సినక్కరే'లో నటిగా అవకాశం ఇచ్చారు. తొలుత దానిని తిరస్కరించిన ఆమె చివరకు ఓకే చెప్పారు. 2003లో ఇండస్ట్రీలోకి వచ్చిన నయన్.. మలయాళం, తమిళం, తెలుగులో వరుస చిత్రాల్లో యాక్ట్ చేశారు. స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ పరంగా ఎన్నో అవమానాలు, ఎత్తుపల్లాలు చూశారు. 'నేను రౌడినే' సమయంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్ తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరి మధ్య ప్రేమ మొదలైంది. కొన్నేళ్లపాటు ప్రేమించుకున్న నయన్ విఘ్నేశ్ పెద్దల అంగీకారంతో 2022లో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. నయనతార చిన్నప్పటినుంచి పెళ్లివరకూ సాగే ప్రయాణాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నారు. పెళ్లి వేడుక డిజిటల్ రైట్స్ కోసం నెటిక్స్ రూ.25 కోట్లు చెల్లించినట్లు సమాచారం. రెండేళ్ల క్రితం దీని ప్రోమో విడుదల చేశారు. నయన గొప్ప నటి మాత్రమే కాదని.. మంచి మనసున్న వ్యక్తి అందులో విఘ్నేశ్ తెలిపారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఆర్సీబీకి మరోసారి కోహ్లి కెప్టెన్ అవుతాడా..?

ఐపీఎల్ లో ఆయా జట్లు ఏయే ఆటగాళ్లను అట్టిపెట్టుకుంటాయి.. ఎవరిని వేలంలోకి వదిలేస్తాయనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



ఐపీఎల్ క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు ఆయా జట్లు ప్రకటించే రిటెన్షన్ జాబితాపైనే ఉంది. ఏయే ఆటగాళ్లను అట్టిపెట్టుకుంటారు.. ఎవరిని వేలంలోకి వదిలేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు అందరి చూపు స్టార్ ఆటగాళ్లపైనే ఉంది. ఐపీఎల్ 2025 సీజను ముందు మెగా వేలం జరగనుంది. ఇందుకోసం ఆయా జట్లు రిటెన్షన్ జాబితా ను ప్రకటించడానికి అక్టోబర్ 31 తుది గడువు. ఈనేపథ్యంలో స్టార్ ఆటగాళ్ల చుట్టూ పలు ఆసక్తికర కథనాలు కూడా చక్కర్లు కొడుతున్నాయి.ఇప్పటివరకూ ఒక్కసారి కూడా టైటిల్ గెలవనప్పటికీ.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఫ్యాన్ బేస్ ఎక్కువగానే ఉంటుంది. ఇక పరుగుల వీరుడు విరాట్ కోహ్లి ఆ జట్టులో ప్రధాన ఆకర్షణ. అతడు కెప్టెన్సీ బాధ్యతలు వదులుకొని బ్యాటర్గా కొనసాగుతున్నాడు. గత మూడు సీజన్లుగా జట్టును ఫాప్ డుప్లెసిస్ నడిపిస్తున్నాడు. అయితే.. మెగా వేలానికి ముందు డుప్లెసిస్ను రిటెయిన్ చేసుకోవడానికి ఆ జట్టు ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఆ జట్టుకు కొత్త కెప్టెన్ రావడం ఖాయం. ఇక గతంలో జట్టును ముందుండి నడిపించిన కోహ్లి పేరే ఈ జాబితాలో ప్రధానంగా వినిపిస్తోండటం గమనార్హం. విరాట్ కోహ్లి మరోసారి ఆ జట్టుకు కెప్టెన్గా మారే అవకాశాలు లేకపోలేదని పలు మీడియా కథనాలు కూడా వెల్లడిస్తున్నాయి. మరోవైపు అభిమానులు కూడా కోహ్లిని మరోసారి ఆర్సీబీ సారథ్య బాధ్యతల్లో చూడాలని ఆసక్తిగా ఉన్నారు. మరి విరాట్ అందుకు అంగీకరిస్తాడా లేదో తెలియాల్సి ఉంది.ఆర్సీబీ ఈసారి కేఎల్ రాహుల్, రిషభ్ పంత్లను తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ కెప్టెన్ బాధ్యతలు స్వీకరించేందుకు కోహ్లి సిద్ధంగా లేకపోతే.. కేఎల్ రాహుల్ను తీసుకొని ఆ బాధ్యతలు అప్పగించాలని ఆ జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే.. వీటిపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం మాత్రం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్సీబీకి కొత్త సారథిగా ఎవరు వస్తారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ మాత్రం కొనసాగుతోంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలో ఒకే జట్టుకు కొనసాగుతున్న ఆటగాడు విరాట్ కోహ్లి. ఆ జట్టుకు 2013 నుంచి 2021 వరకూ సారథ్య బాధ్యతలు నిర్వర్తించాడు. జట్టును ఒకసారి ఫైనల్ వరకూ తీసుకొచ్చాడు. అయితే టైటిల్ మాత్రం అందించలేకపోయాడు. ఇక విరాట్ కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో.. చెన్నై జట్టు నుంచి వచ్చిన డుప్లెసిస్కు జట్టు ఆ బాధ్యతలు అప్పగించింది. కాగా ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఫ్రాంఛైజీలకు ఇప్పటికే ఐపీఎల్ పాలకవర్గం అనుమతించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కలిసి ఉంటుంది. ఈ జాబితాను ప్రకటించడానికి గడువు ఈనెల చివరి తేదీ వరకు మాత్రమే. ఇప్పటివరకు ఏ ఫ్రాంఛైజీ కూడా అధికారికంగా జాబితాను విడుదల చేయలేదు.

## అందం

కరివేపాకు.. దీనిని తినడం వల్ల హెల్త్ బెనిఫిట్స్ నుంచి బ్యూటీ బెనిఫిట్స్ వరకూ ఎన్నో లాభాలున్నాయి. వీటిని తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి ఐరన్ లోపం తగ్గుతుంది. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. దీనిని ఆహారంలో తీసుకుంటే చాలా లాభాలున్నాయి. పచ్చి కరివేపాకుని నమిలితే చాలా లాభాలున్నాయి. అవేంటో తెలుసుకోండి...



## పరగడుపున కరివేపాకు తింటే కలిగే ముఖ్య లాభాలివే




### ఎముకల బలానికి..



కరివేపాకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది దంతాలు, ఎలుకల ఆరోగ్యానికి మంచివి. వీటిని తినడం వల్ల కీళ్ళనొప్పులు, షుగర్ ఉన్నవారిలో ఎముకలని నొప్పిని తగ్గించి ఎముకల్ని బలంగా మారుస్తుంది.

### కిడ్నీలకు మందుగా..




కరివేపాకులో ఫాస్ఫరస్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి, దీనిని తీసుకోవడం వల్ల డీటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడపున కరివేపాకుని తింటే మూత్రపిండాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు పూర్తిగా తొలిగి వాటి పనితీరు మెరుగవుతుంది.

### ఇమ్యూనిటీ..



రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఓ గ్రాము పచ్చి కరివేపాకు తింటే ఇమ్యూనిటీ పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కరివేపాకులో ప్రోటీన్స్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీని వల్ల ఇమ్యూనిటీ బలంగా మారతుంది. ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి

### కొలెస్ట్రాల్‌ని తగ్గించడం..




కరివేపాకు తింటే అనే చెడు కొలెస్ట్రరాల్ తగ్గుతుంది. దీంతో రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోదు. చెడు కొలెస్ట్రాల్ తగ్గితే బీపి కూడా కంట్రోల్ అవుతుంది. దీంతో గుండె సంబంధ సమస్యలు తగ్గి హార్ట్ హెల్త్ బాగుంటుంది.

### మలబద్ధకానికి మందుగా..



కరివేపాకులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. దీంతో మలబద్ధకం సమస్య దూరమవుతుంది. కొందరికీ అజీర్ణం కారణంగా విరోచనాలు అవుతాయి. కరివేపాకుని పచ్చిగా తింటే ఈ సమస్య దూరమవుతుంది. అయితే, ఎక్కువగా తింటే మాత్రం డయేరియా వస్తుంది.

### జుట్టు బలానికి..



జుట్టు రాలడానికి కారణం కుదుళ్ళు ఆరోగ్యంగా లేకపోవడమే.. ఇందుకు ప్రోటీన్ లోపం, ఐరన్ లోపం. ఈ రెండు లోపాల కారణంగా జుట్టు రాలుతుంది. అయితే, కరివేపాకు తింటే ఈ సమస్యలు దూరమవుతాయి. కరివేపాకులో విటమిన్ బి12, విటమిన్ ఇ జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.